క్లుప్తంగా

పోటీతత్వంతో చదవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కొండవేటి సత్యనారాయణ

నరసాపురం రూరల్: విద్యార్థులు పోటీతత్వంతో చదివి అవకాశాలను అందిపుచ్చుకోవాలని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్ కొండవేటి సత్యనారాయణ అన్నారు. గురువారం సీతారాంపురం స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ, బీబీఏ మొదటి సంవత్సరం విద్యార్థుల తరగతుల ప్రారంభం సందర్భంగా ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ సత్యనారాయణతో పాటు స్వర్ణాంధ్ర ట్రెజరర్ వెంకటేశ్వరస్వామి (త్రినాథ్), డైరెక్టర్ అడ్డాల శ్రీహరిలు మాట్లాడుతూ కోర్సు పూర్తిఅయ్యేలోపు సబ్జెక్టుపై పట్టుసాధించి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సురేష్‌కుమార్, ఏఎస్ఎల్ కుమార్, గంటా గ్రేస్, రామభద్రరావు, ఓసూరి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపుల పరిశీలన



సిబ్బంది నుంచి వివరాలు సేకరిస్తున్న ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు

పెనుగొండ: ప్రభుత్వ ఆదేశాల మేరకు 2021 నుంచి 2024 వరకు వివిధ ఇసుక ర్యాంపుల్లో జరిగిన తవ్వకాలపై విచారణకు వచ్చినట్లు ఏసీబీ డీఎస్పీ సుబ్బరాజు తెలిపారు. గురువారం ఆచంట నియోజకవర్గంలో కోడేరు కలుగోరిమిల్లి సిద్ధాంతం నడిపూడి ఇసుక ర్యాంపులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఇసుక తవ్వకాలలో నిబంధనలు ప్రకారం తవ్వకాలు జరిపారా? వివిధ వాహనాలకు ఏ విధమైన వసూళ్లు జరిగాయా? అని స్థానిక వీఆర్వోలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట విజిలెన్స్ సీఐ భాస్కర్ రావు ఉన్నారు.

బాల్య వివాహాలు చట్ట వ్యతిరేకం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సర్పంచ్ శ్యామలాసోనీ శాస్త్రి

పెనుగొండ: బాల్య వివాహాలు చట్ట వ్యతిరేకమని ప్రతి ఒక్కరూ అవగాహనతో బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయాలని పెనుగొండ సర్పంచ్ నక్కా శ్యామాలసోనీ శాస్త్రి అన్నారు. గురువారం పెనుగొండ పంచాయతీ వద్ద ఐసీడీఎస్ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధానికి గ్రామ కమిటీలు బాధ్యతతో కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి టి.రత్నాకరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

కట్నం వేధింపులపై కేసు నమోదు

నరసాపురం: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్తమామలపై పట్టణంలోని 1వవార్డు శ్రీహరిపేటకు చెందిన తానింకి దుర్గాభవానీ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పట్టణ ఎస్సై జయలక్ష్మి తెలిపిన వివరాలివి. దుర్గాభవానీకి శ్రీహరిపేటకు చెందిన నాగరాజుతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వివాహ సమయంలో రూ.3 లక్షల నగదు, కొంత బంగారం కట్నంగా ఇచ్చారు. అయితే కొన్ని నెలలుగా దుర్గాభవానీని అదనపు కట్నం కోసం భర్త నాగరాజు, అత్తమామలు వెంకటేశ్వరరావు, నాగమణి వేధిస్తున్నారు. పెద్ద మనుషులతో చెప్పించినా వేధింపులు ఆవపకపోవడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై చెప్పారు.

మావుళ్లమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్ళమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని గురువారం అధికారులు లెక్కించారు. 55 రోజులకి హుండీ నగదు రూ.43,38, 959, బంగారం 104 గ్రాముల 400 మిల్లి గ్రాములు, వెండి 274 గ్రాములు 600 మిల్లి గ్రాములు, విదేశీ డాలర్లు వచ్చాయి. ఆలయ ప్రధానర్చకులు బ్రహ్మ శ్రీ మద్దిరాల మల్లికార్జునశర్మ, వి.వెంకటేశ్వరరావు, కర్రి శ్రీనివాస్, బుద్ద మహాలక్ష్మి పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో ఎంతో లాభం

ఉండి: సేంద్రియ వ్యవసాయం అటు రైతులకు, ఇటు ప్రజలకు ఎంతో లాభసాటిగానూ, ఆరోగ్యకరం గానూ ఉంటుందని నేచురల్ ఫార్మింగ్ ఉండి డివిజన్ ఇన్‌ఛార్జ్ మహేష్ అన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నడిచే ప్రకృతి వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గురువారం ఉండి మండలం పెదపుల్లేరు సేంద్రీయ వ్యవసాయంపై రైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు.



మహిళలను రక్షించడం అందరి బాధ్యత



ప్రతి ఇంట్లో అమ్మ, అక్క, చెల్లి ఉంటారు. సమాజంలో మహిళలను కాపాడుకోవడం అందరి బాధ్యత. తల్లిదండ్రులు పిల్లలను చిన్నతనం నుంచే సమ భావనతో పెంచాలి. నైతిక విలువలు నేర్పాలి. మహిళ ఉంటేనే పురుషుల మనుగడ ఉంటుందనేది మరిచిపోకూడదు. తప్పు చేసిన వారిపై ప్రభుత్వాలు అత్యంత కఠినంగా వ్యవహరించాలి.

– డాక్టర్ బి.అనిల్, ఎల్పీచర్ల పీహెచ్‌సీ

ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి



కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచారం సంఘటనతో దేశం మొత్తాన్ని ఉలిక్కిపడేలా చేసింది. ఆ సంఘటన తర్వాత మహిళా ఉద్యోగులకు, ముఖ్యంగా రాత్రి, పగలు తేడా లేకుండా పనిచేస్తున్న వైద్య ఉద్యోగులు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి. అలాగే మహిళలపై లైంగిక దాడులకు పాల్పడే వ్యక్తులకు కఠినమైన శిక్షలు విధించాలి.

– డి.సరళా ప్రకాష్, ఏఎన్ఎం, పాలకొల్లు రూరల్

దోమకాటు..ఎంతో చేటు

జాగ్రత్త చర్యలు తీసుకోవాలంటున్న వైద్యులు

మొగల్తూరు: వర్షాకాలంలో దోమకాటు ఎంతో చేటు చేస్తుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులను నివారించేందుకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ వాకపల్లి ప్రసాద్ తెలిపారు. మలేరియా, డెంగీ వ్యాధులు రాకుండా తీసుకోవల్సిన జాగ్రత్తలపై గురువారం ఆయన సాక్షితో మాట్లాడారు. ముఖ్యంగా మలేరియా వ్యాధి రావడానికి కారణం ప్లాస్మోడియం జాతి క్రిమి ద్వారా ఈవ్యాధి సంభవిస్తుందని, ఆడ ఎనాఫిలస్ దోమ వ్యాధి గ్రస్తున్ని కుట్టి మరల అదే దోమ ఆరోగ్యవంతుని కుడితే ఈవ్యాధి వ్యాప్తి చెందుతుందున్నారు. చిన్న పిల్లలకు, గర్భిణీ స్త్రీలకు ఈ వ్యాధి సంక్రమిస్తే అత్యంత ప్రమాదకరమన్నారు.

మలేరియా వ్యాధి లక్షణాలు, చికిత్స

చలి వణుకుతో కూడిన జ్వరం, విపరీతంగా చెమటలు పట్టడం, తలనొప్పి, వికారంగా ఉంటుంది. మలేరియాకు డాక్టర్, ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షణలో చికిత్స తీసుకోవాలి. క్లోరోక్విన్ మాత్రలు ఆర్టిమిసినిన్ కాంబినేషన్ థెరఫీ మాత్రలు వయస్సువారీగా తీసుకోవాల్సి ఉంటుంది. వ్యాధి నయమయ్యే వరకు క్రమం తప్పకుండా పూర్తి చికిత్స తీసుకోవాలి.

డెంగీ వ్యాధి వ్యాప్తి, లక్షణాలు

డెంగీ వ్యాధి ఆర్బోవైరస్ జాతికి చెందినది. ఒక మనిషి నుంచి మరో మనిషికి వ్యాప్తి చెందిందేకు ఏడిస్ ఈజిప్టు అనే దోమ కారణం. దోమకాటు ద్వారా ఒకరి నుండి మరొకరికి ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ చిన్నచిన్న నీటి నిల్వలలో పెరుగుతాయి.

తీవ్రమైన జ్వరం, తలనొప్పి, శరీరంపై ఎర్రటి దద్దుర్లు, కండరాల నొప్పి, వాంతులు, వికారం వంటి లక్షణాలు ఉంటాయి. కంటి కదలికలు తగ్గడమే కాకుండా కదలినప్పుడు భరించలేని నొప్పి వస్తుంది. కండరాలు, కీళ్ల నొప్పులు, వాంతి అవుతున్నట్లు అనిపించడం, నోరు ఎండిపోవడం, అధిక దాహం వేస్తూ ఉంటుంది. అశ్రద్ధ చేస్తే తీవ్ర రక్త స్రావం అయ్యి ప్రాణాపాయం సంభవిస్తుంది.



మొగల్తూరులో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్) వాకపల్లి ప్రసాద్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

పరీక్షలు, చికిత్సా విధానం

డెంగీ నిర్ధారణలో చేసే పరీక్షలే కీలకం. కేవలం ప్లేటిలెట్స్ కౌంట్, డెంగీ స్ట్రిప్ వంటి సాధారణమైన వాటితో దీనిని నిర్ధారించడం పూర్తిగా శాస్త్రీయం కాదు. ఎన్ఎస్–1 యాంటిజెన్, ఐ.జి.ఎం (ఇమ్యునో గ్లోబ్యులిన్ యాంటీ బాడీ) , ఇమ్యునో గ్లోబలిన్ -జి, పరీక్షలు చేయించి వ్యాధిని నిర్ధారించాలి. రక్తనమూనాలను ఎలీసా పరీక్ష ద్వారా మాత్రమే వ్యాధి నిర్ధారణ చేయాలి. తగినంత విశ్రాంతి తీసుకోవడం, ద్రవ పదార్థ ఆహారం ఎక్కువగా తీసుకోవాలి. డాక్టర్ల సలహా మేరకే మందులు తీసుకోవాలి. అశ్రద్ధ వహిస్తే డెంగీ హెమరేజిక్ ఫీవర్‌గా మారి ప్రాణాపాయం కలగవచ్చు.

ప్లేట్‌లెట్స్ కౌంట్ తగ్గగానే దాన్ని డెంగీ వ్యాధి అనే అపోహ పడే అవకాశం ఉంది. వైరల్ జ్వరాల్లో కూడా ప్లేట్‌లెట్స్ తగ్గే అవకాశం ఉంది. సాధారణ స్థితిలో 1.5లక్షలు నుంచి 4లక్షల క్యూబిక్ మిల్లీ మీటర్ ఉండే ప్లేట్‌లెట్స్ కౌంట్ 10 నుంచి 20వేలకు తగ్గినప్పుడే ప్రమాద సూచికగా పరిగిణంచే అవకాశం ఉంది.

డెంగీ జ్వరం వచ్చినప్పుడు జ్వర తీవ్రతను తగ్గించడానికి చల్లని నీటిలో స్పాంజిని ముంచి శరీరాన్ని తుడవాలి. ఎలక్ట్రాల్ పౌడర్ కాని, పండ్ల రసాలు కాని రోగికి ఇస్తుండాలి. దీని వల్ల జ్వర తీవ్రత తగ్గి ప్లేట్‌లెట్స్ అదుపులోకి వస్తాయి. జ్వరం అదుపులో ఉంచేందుకు పారాసిటమాల్ మాత్రమే వాడాలి

పరిశుభ్రతే ముఖ్యం

డెంగీ వ్యాధి నివారణకు ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఇంటి చుట్టుపక్కల నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం, ఇంటి లోపలకు దోమలు రాకుండా కిటకీలకు, తలుపులకు మెస్ ఏర్పాటు చేసుకోవాలి. పగటి పూట దోమలు కుట్టకుండా చూసుకోవడంతో పాటు శరీరం పూర్తిగా కప్పేలా దుస్తులు ధరించడం, దోమ తెరలు వాడటం చేయడం ద్వారా మలేరియా, డెంగీ వ్యాధులు నయం చేయవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

నేడు క్షీరారామంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ముచ్చర్ల శ్రీనివాస్ గురువారం విలేకరులకు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. పూజలో పాల్గొనే మహిళలు ముందుగా దేవస్థానం కౌంటర్ వద్ద తమ గోత్రనామాలు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ పూజలకు ఏవిధమైన రుసుము లేదు, పూజాద్రవ్యాలు ఆలయం వారే ఏర్పాటు చేయనున్నారు. పూజలో పాల్గొనే మహిళలకు లక్ష్మీదేవి ప్రతిమ రూపులు అందించనున్నట్లు తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయంలో వరలక్ష్మీ వ్రత పూజలు

మొగల్తూరు: శ్రావణమాసం నేపథ్యంలో ముత్యాలపల్లిలో ఉన్న శ్రీ బండి ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వహణాధికారి డి.రామకృష్ణంరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సామూహిక పూజలతో పాటు గౌరీ కుంకమ పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. భక్తులందరూ ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నాలని కోరారు.

ఉచిత కుట్టు శిక్షణ శిబిరం ప్రారంభం



ఉచిత కుట్టు శిక్షణ శిబిరంలో మహిళలతో అతిథులు

పాలకొల్లు అర్బన్: వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండు నెలల ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని రైస్ మిల్లర్ పెన్మెత్స రామచంద్రరాజు అన్నారు. మండలంలోని జిన్నూరులో స్థానిక పెన్మెత్స బాపిరాజు భవనంలో వసుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రెండో విడత కుట్టు శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఫౌండేషన్ ఏరియా కోఆర్డినేటర్ పెన్మెత్స బుద్ధరాజు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జ్వర పీడితులను ఆదుకోవాలి

పెనుగొండ: గ్రామాల్లో జ్వర పీడితులను ప్రభుత్వం సత్వరం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం పెనుగొండ తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తహసీల్దారు అనితకుమారికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు షేక్ పాదుషా, మాదాసు నాగేశ్వరరావు, నీలాపు ఆది నారాయణ, శీలం ఏసు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొల్లు అర్బన్: పోడూరు మండలం కొమ్ముచిక్కాల 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 11కేవీ కొమ్ముచిక్కాల ఫీడర్‌లో వార్షిక మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎలక్ట్రికల్ సబ్ డివిజనల్ ఇంజనీర్ బళ్ల సురేష్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈకారణంగా కొమ్ముచిక్కాల, వాలమర్రు, జిన్నూరుపాలెం, పి పోలవరం, కాపవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పాలకొల్లు మండలంలో.....

పాలకొల్లు మండలం అడవిపాలెం 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎలక్ట్రికల్ సబ్ డివిజనల్ ఇంజనీర్ బళ్ల సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. యాళ్లవానిగరువు, జీ+1 కాలనీ, సబ్బేవారిపేట, పెనుమదం రోడ్డు, మార్క్ పేట, బ్రాడీపేట బైపాస్ రోడ్డు, లక్ష్మీ నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని పేర్కొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



నరసాపురం: ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో క్రీడా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పాలకొల్లు సెంట్రల్: ఏఎస్ఎన్ఎం కళాశాలలో విజేతలతో అధ్యాపకులు

నరసాపురం: పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురువారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని కాపు వనితాక్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాలికలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా కాపు వనితాక్లబ్ రీజినల్ చైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ బాలికలను కూడా క్రీడల్లో ప్రోత్సహించాలని సూచించారు. అలాగే తెలుగు భాషా దినోత్సవం విశిష్టతను కూడా వివరించారు. జిల్లా ఉత్తమ గ్రంథాలయ అధికారిగా అవార్డు అందుకున్న కేజేఎస్ఎల్ కుమారి, బాలికోన్నత పాఠశాల పీఈటీ ఇందిరావాణిలను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు పుప్పాల ఉమామహేశ్వరి, కార్యదర్శి బండి స్వర్ణలత, రంగినీడి భరణి తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ఎం కళాశాలలో

పాలకొల్లు సెంట్రల్: ప్రతి విద్యార్థి చదువులతో పాటు క్రీడల్లో కూడా ప్రావీణ్యం సాధించాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రాజరాజేశ్వరి అన్నారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కళాశాలలో నిర్వహించిన క్రీడల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక ధృడత్వంతో పాటు ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. జాతీయ రాష్ట్ర స్థాయి క్రీడల్లో విజేతలుగా నిలిచిన వారికి ప్రభుత్వ ఉద్యోగాల్లో కూడా అవకాశం ఉంటుందన్నారు. హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ భారతదేశ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా ప్రకాశింపజేశారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టి.కృష్ణ, పీటీ ఎం.రామకృష్ణ, జి.మహేష్, అధ్యాపకులు డి.శ్రీనివాసు, డి.మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

ఆక్వా సాగులో నిబంధనలు పాటించాలి



మొగల్తూరులో మాట్లాడుతున్న ఏడీఎఫ్ వెంకటేశ్వరరావు

మొగల్తూరు: అప్సడా, ఎంపెడా నిబంధనలకు అనుగుణంగా రైతులు ఆక్వా సాగు చేసుకోవడంతో పాటు ప్రభుత్వ నిబంధనలు పాటించాలని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ఫిషరీస్(ఏడీఎఫ్) సీహెచ్ వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆక్వా రైతులు, డీలర్లతో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఆక్వా సాగు చేస్తున్న రైతులందరూ అప్సడా, ఎంపెడాలో విధిగా నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి రైతూ చెరువులు తవ్వే ముందు అప్సడాలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. అలాగే సాగు చేసే ముందు ప్రతి రైతూ గుర్తింపు పొందిన హేచరీల్లోనే సీడ్ కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో ఎంపెడా టెక్నికల్ అధికారి ఎం.దుర్గారావు, ఎంపీడీఓ వి.బాబ్జిరాజు, ఎఫ్‌డీఓ కె.వివేక్ తదితరులు పాల్గొన్నారు.

లిఫ్ట్ అడిగి గొలుసు చోరీ

పాలకొల్లు సెంట్రల్: లిఫ్ట్ అడిగారని వాహనం ఎక్కించుకుంటే వాహనదారుని గొలుసే ఎత్తుకుని వెళ్లిపోయిన సంఘటన పట్టణంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు గురువారం బాధితుడు ఆచంట మండలం కరుగోరుమిల్లి గ్రామం బొల్లావారిపాలెంకు చెందిన ఉండపల్లి శ్రీనివాస సుబ్బారావు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుబ్బారావు మార్చి నెల 16న ఆరోగ్య సమస్యతో భీమవరంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స కోసం వెళ్లాడు. చికిత్స చేయించుకుని తిరిగి తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా రాత్రి సుమారు 7 గంటల సమయంలో పాలకొల్లు బైపాస్ రోడ్డు పెట్రోల్ బంక్ సమీపంలో ఒక వ్యక్తి లిఫ్ట్ అడగ్గా సుబ్బారావు తన వాహనం ఎక్కించుకున్నాడు. నరసాపురం రోడ్డులో అయ్యప్పస్వామి ఆలయం వద్దకు వచ్చేసరికి లిఫ్ట్ అడిగిన వ్యక్తి వాహనం ఆపమని కోరాడు. వాహనం ఆపగా అప్పటి వరకూ అక్కడ వేచి ఉన్న మరో వ్యక్తి సుబ్బారావు దగ్గరకు వచ్చి కత్తి తీసి నీ మెడలో ఉన్న గొలుసు ఇవ్వాలని లేదంటే చంపుతానని బెదిరించాడు. సుబ్బారావు భయంతో గొలుసు తీసి వారికి ఇచ్చేశాడు. ఈ విషయం ఎవరితోనైనా చెబితే నీ అంతుచూస్తానని బెదిరించి వెళ్లిపోయారు. భయంతో ఇప్పటి వరకూ ఈ విషయం ఎవ్వరికీ చెప్పలేదు. కాని అప్పటి నుంచి బాధితుడు సుబ్బారావు వీళ్ల ఇద్దరూ ఎవరా? అని ఆరా తీస్తూనే ఉన్నాడు. ఇద్దరిలో ఒక వ్యక్తి యలమంచిలి మండలం పెనుమర్రు గ్రామానికి చెందిన పి.నరసింహాస్వామి అని తెలుసుకుని పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పట్టణ ఎస్సై బాదం శ్రీనివాసు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నల్లి తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలి

ఆకివీడు: ఖరీఫ్‌లో అక్కడక్కడా ఆకుముడత, కాండం తొలిచే పురుగు, నల్లి తెగులు ఆశించిందని దీని నివారణకు మందులు సూచించాలని రైతులు వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన పొలంబడిలో ఏడీఏ కేఏఎస్ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ నల్లి నివారణకు క్రొఫోనోఫాస్ మందు పిచికారీ చేయవద్దని సూచించారు. వర్షాలు కురిస్తే నల్లి నశించిపోతుందని చెప్పారు. మందులు పిచికారీ చేస్తే భవిష్యత్‌లో దోమ ఉధృతి పెరగవచ్చునని హెచ్చరించారు. ఏఓ ప్రియాంక మాట్లాడుతూ మండలంలో ఈ క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి అయిందని చెప్పారు. వీపీఏ రాంప్రసాద్, కేశవరాజు, వెంకట్, ఆటీకే మండల మాజీ డైరెక్టర్ ఎరిచర్ల సాంబర్లిన్, వెంకట రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

కొణితివాడలో

వీరవాసరం: ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పురుగులు ప్రబలే అవకాశం ఉందని రైతులు నివారణ చర్యలు తీసుకోవాలని భీమవరం ఏడీఏ సీహెచ్ శ్రీనివాస్ సూచించారు. కొణితివాడలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏఓ బిన్నీబాబు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి సేవలు ఎనలేనివి



నరసాపురం: బీజీబీఎస్ మహిళా కళాశాలలో మాట్లాడుతున్న వక్తలు



పాలకొల్లు అర్బన్: దిగమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

నరసాపురం: తెలుగు బాషాభివృద్ధికి గిడుగు వెంకట రామ్మూర్తి చేసిన సేవలు ఎనలేనివని బీజీబీఎస్ మహిళా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూలి శ్రీనివాస్ అన్నారు. గిడుగు వెంకటరామ్మూర్తి జయంతి సందర్భంగా గురువారం కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఇతర భాషలతో పోలిస్తే తెలుగుభాషకు అనేక ప్రత్యేకతలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.మధుషాలిని ఎన్ఎస్ఎస్ పోగ్రామ్ ఆఫీసర్ రజనీకుమారి తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: తెలుగుభాషా దినోత్సవాన్ని మండలంలోని పలు పాఠశాలల్లో గురువారం ఘనంగా నిర్వహించారు. దిగమర్రు జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన భాషా సామర్థ్యాలు, క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన గిడుగు రామ్మూర్తి, గురజాడ అప్పారావు, సీపీ బ్రౌన్ వేషధారణలో విద్యార్థులు అలరించారు. పాఠశాల హెచ్ఎం కోట శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించినకార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ పీర్ సాహెబ్, గొల్లమందల రాజు, సీహెచ్ వీరాస్వామి, వలవల రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

శివదేవునిచిక్కాలలో....

తెలుగుభాషాభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయుడు గిడుగు రామ్మూర్తి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని శివదేవునిచిక్కాల జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. హెచ్ఎం పొట్ల రాము అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.అనూరాధ, లక్ష్మీదేవి, జి.సుబ్రహ్మణ్య శాస్త్రి, ఎ.సత్యనారాయణ, వీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు

పాలకొల్లు సెంట్రల్: వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి రోజును తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకోవడం అభినందనీయమని ప్రముఖ సాహితీ వేత్త సీవీవీ సత్యనారాయణమూర్తి అన్నారు. గురువారం కెవిఎం ఛాంబర్స్ జూనియర్ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహనా సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. పట్టణంలో జీవీఎస్‌వీఆర్ఎం ప్రాథమిక పాఠశాలలో యునైటెడ్ కాపు క్లబ్ ఆధ్వర్యంలో, దాసరి నారాయణరావు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. చాంబర్ కళాశాల చైర్మన్ కారుమూరి వెంకట నరసింహరావు, కొట్టి భాస్కరరావు, కళాశాల ప్రిన్సిపాల్ తోట ఓల్గా, వైఎన్ కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకులు మధుర మురళీకృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ పాల్గొన్నారు.

ఆక్వా రంగానికి నాబార్డు రుణాలు



కాజలో హేచరీని పరిశీలిస్తున్న నాబార్డు కేంద్ర బృందం

యలమంచిలి: ఆక్వా రంగంలోని ఉప్పు నీటి రొయ్యల సాగులో హ్యాచరీలకు నాబార్డు రుణాలు అందించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలుసుకునేందుకు నాబార్డు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చారు. మత్స్యశాఖ అధికారులతో కలిసి గురువారం కాజ గ్రామంలోని శ్రీసాయి సంపద హేచరీని సందర్శించారు. హేచరీ యజమాని కొడవటి సత్యనారాయణ, సిబ్బందితో మాట్లాడి హ్యాచరీ ఏర్పాటుకు ఎంత నిధులు కావాలి? సిబ్బంది ఎంత మంది పని చేస్తున్నారు? వారి విద్యార్హతలు, వార్షిక టర్నోవరు, లాభం తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. హేచరీకి నాప్లియా ఎలా తీసుకువస్తారు? వాటిని ఎలా అభివృద్ధి చేస్తారు? అనే విషయాలను స్వయంగా పరిశీలించారు. అనంతరం దగ్గరలోని రొయ్యల చెరువులను కేంద్ర బృందం పరిశీలించింది. వారికి మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఎల్ఎఎస్ రాజు, ఎఫ్‌డీఓ ఏడుకొండలు సహకారం అందించారు. నాబార్డు బృందంలో టి.అనిల్‌కాంత్, శివాంగి, గణేష్, విశాల్ ఉన్నారు.